## ఆస్తిపన్ను వసూలుకు అధికారులు చర్యలు

ప్రైవేట్ పాఠశాల నుంచి రూ.3 లక్షల చెక్కును వసూలు చేస్తున్న ఏఎంసీ కమల్, ఇన్‌చార్జి ఏఎంసీ బాలరాజ్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 23: ఆస్తిపన్ను వసూలుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో మొండి బకాయిలపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. మార్చి 31తో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గడువు ముగియనుండడంతో అధికారులు వేగం పెంచారు. ఆస్తిపన్ను లక్ష్యాన్ని చేరేందుకు ప్రతి శనివారం ఆస్తిపన్ను పరిష్కార వేడుకలు ఏర్పాటు చేస్తూ.. ప్రతి ఆదివారం వసూలును ముమ్మరం చేస్తున్నారు. పాత బకాయిలు వసూలు చేసేందుకు మొండి బకాయిదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఒక ప్రైవేట్ పాఠశాలకు యూసుఫ్‌గూడ సర్కిల్ అధికారులు వారెంట్‌లు జారీ చేయగా ఆదివారం రూ.3 లక్షల చెక్కు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. జీ హెచ్ ఎంసీ 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తాన అధ్వర్యంలో ఏఎంసీలు ఎస్‌వై కమల్, బాలరాజ్, సూపరింటెండెంట్‌లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు బృందాలుగా ఏర్పడి ఆస్తిపన్ను వసూలు చేపడుతున్నారు.

## మాల విద్యార్థి, యువగర్జన వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 25న నిర్వహించనున్న మాల విద్యార్థి, యువగర్జనను వాయిదా వేస్తున్నట్లు తెలంగాణ మాల విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చినేని వెంకట్ తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పై నియమించిన ఏక సభ్య కమిషన్ కాల పరిమితిని పొడగించడంతోపాటు వచ్చే నెల మొదటి వారంలో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి వర్గీకరణ బిల్లును ఆమోదించాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. వచ్చే నెల 3న నిర్వహించనున్న విద్యార్థి యువజన కార్యవర్గ సమావేశంలో భవిష్యత్తుపై చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

## క్రీడలతో మానసికోల్లాసం..

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 23 : క్రీడలు మానసికొల్లాసాన్ని ఇస్తాయని , ప్రధానంగా విద్యార్థులకు ఎంతో అవసరమని పీవీ నర్సింహరావు పశువైద్య విశ్వవిద్యాలయం డీన్ డా.సతీశ్‌కుమార్ అన్నారు. మూడవ ఇంటర్ కాలేజ్ క్రీడా సాహితి , సంస్కృతిక పోటీలు రెండవ రోజు ఉత్సహంగా జరిగాయి. ఆదివారం రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో జరిగిన పోటీల్లో ఆయన మాట్లాడుతూ.. ప్రతి మనిషి పోటీతత్వం ఉన్నప్పుడే ఉత్తమ లక్ష్యాలకు కనుగుణంగా పనిచేయగలరన్నారు. ఒకేసారి సాధించక పోయినా.. ధృడ సంకల్పంతో కృషి చేస్తూనే ఉండాలని అన్నారు. రిజిస్ట్రార్ శరత్ చంద్ర మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి ఎంతో దోహదపడుతాయన్నారు. విద్యార్థులకు, సిబ్బందికి చదువుతోపాటు, శారీరక ధృడత్వం ఎంతో అవసరమన్నారు. తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొని క్రీడా స్ఫూర్తిని ఆస్వాదించాలని సూచించారు. క్రీడలు శారీరక , మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయన్నారు. వర్సిటీ పరిధిలోని రాజేంద్రనగర్, మామునూర్, కోరుట్ల, కామారెడ్డి, పెబ్బేర్, కళాశాలలనుంచి 250 మంది విద్యార్థినీ విద్యార్థులు, బోధన సిబ్బంది , బోధేతర సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

## వైభవంగా శివపార్వతుల కల్యాణం

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్, పద్మశాలిపురంలోని శివాలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ మహోత్సవానికి మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తోపాటు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజల్లో నాయకులు ఎల్‌వీ రెడ్డి, భూపతిరెడ్డి, తలారి చిన్న, బుగ్గయ్య గురుస్వామి, రమేశ్, అవినాశ్, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. – మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 23

## భ్రమరాంబ మల్లికార్జున స్వామివారి కల్యాణం..

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 23: బోరబండ మల్లన్నస్వామి జాతర రెండో రోజు భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదివారం కల్యాణం, ప్రత్యేక పూజలు, అగ్నిగుండాలు, గొలుసు తెంపుట, మల్లన్నస్వామివారి బోనాలు, అన్నదానం చేపట్టారు. సోమవారం నాగవెళ్లితో జాతర ముగుస్తుంది. పూజల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు మహేశ్ యాదవ్, ఆంజనేయులు యాదవ్, వీరేశ్‌యాదవ్, శివన్న యాదవ్, శంకర్‌యాదవ్ పాల్గొన్నారు.

## కిస్మత్‌పూర్‌లో చోరీ..

బండ్లగూడ, ఫిబ్రవరి 23: తాళం వేసిన ఇంట్లో దొంగపడి డబ్బులు దోచుకెళ్లాడు. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కిస్మత్‌పూర్‌లో మెరుగు రామకృష్ణ .. తన కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఆదివారం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఓ దొంగ తాళం పగులగొట్టాడు. ఎదురింటివారు గమనించి రామకృష్ణకు సమాచారం అందించారు. అతను వచ్చి చూడగా డోరు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి పరిశీలించి మూడు వేల రూపాయలు పోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించి.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గుడ్‌టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలి..

మాట్లాడుతున్న సంతోశ్‌కుమార్

హిమాయత్ నగర్ , ఫిబ్రవరి 23: ప్రాథమిక దశలోనే విద్యార్థులకు గుడ్ టచ్ .. బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలని వెంట్రిలాక్విజం కళాకారుడు సంతోశ్‌కుమార్, ప్రతినిధి ఆంజనేయులు అన్నారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంతోశ్‌కుమార్ మాట్లాడుతూ.. వెంట్రిలాక్విజంలో అందిస్తున్న సేవలను గుర్తించి ఇటీవల ముంబైలో ఇంటర్నేషనల్ ఎర్లీ చైల్డ్ హుడ్ అసోసియేషన్ తనకు జాతీయ స్థాయి అవార్డును అందజేసిందని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు దగ్గరికి వచ్చేటప్పుడు బాలికలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

## మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్.. కేసు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 23: మద్యం మత్తులో అతి వేగంగా కారు నడుపుతున్న వ్యక్తితో పాటు అందులో ఉన్న స్నేహితులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న మెహుల్ సింగ్ పర్మార్(23).. తన స్నేహితులతో కలిసి మద్యంతాగి బంజారాహిల్స్ రోడ్ నం. 12లో వెంగళ్‌రావు బస్‌స్టాప్ మీదుగా కారులో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ దూసుకువచ్చారు. గమనించిన పోలీసులు వారిని అడ్డుకుని బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించారు. పర్మార్‌కు 148 బీఏసీ రాగా, స్నేహితులు తుషార్ మల్‌హోత్రాకు 82 బీఏసీ, సాగర్ సోనికి 144 బీఏసీ గా తేలింది. దీంతో ముగ్గురిపై బీఎన్ఎస్ 110 సెక్షన్‌తో పాటు ఎంవీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అలరించిన భరతనాట్యప్రదర్శన

కొండాపూర్ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నది. ఆదివారం బెంగళూరుకు చెందిన సుముఖశ్రీ కళా కుటీర కళాకారులు అశ్విని సుకీర్తి బృందం భరతనాట్య ప్రదర్శన అలరించింది. తం తం తం మూషిక వాహన, రారా వేణు, సరసిజాక్షులు, దరు వర్ణం, శ్రీరాజరాజేశ్వరి, జావళి, చంద్రచూడా, నవరస రామాయణ అంశాలను అశ్విని సుకీర్తి, స్వాతి, పూజిత, రక్షిత, మోనిక, సుదీప్తి, వర్ష, కీర్తన, వైభవి ప్రదర్శించారు.

## ట్రాఫిక్ జంక్షన్‌లో కారుతో విన్యాసాలు

### ముగ్గురు విద్యార్థులు అరెస్ట్

పోలీసుల అదుపులో కారులో స్టంట్స్ చేసిన నిందితులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 23: జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద ట్రాఫిక్ జంక్షన్‌లో అత్యంత ప్రమాదకరంగా కారులో స్టంట్స్ చేసిన ఘటనలో ముగ్గురు యువకులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్‌లో ఓ కారు నడి రోడ్డుమీద స్టంట్స్ చేస్తూ వాహనదారులను భయభ్రాంతులకు గురిచేసింది. ఈ కారు విన్యాసాలను తమ సెల్‌ఫోన్‌లో బంధించిన ప్రయాణీకులు నగర పోలీస్ కమిషనర్‌కు ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని సీపీ.. జూబ్లీహిల్స్ పోలీసులను ఆదేశించారు. దీంతో శనివారం సుమోటోగా కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదకరంగా స్టంట్స్ చేసిన కారు(ఏపీ 09ఏక్యూ 7209)గా గుర్తించారు. ఈ మేరకు బీఎన్ఎస్ 292, 281, 125,126(2), 49 రెడ్‌విత్ 54 సెక్షన్లతో పాటు ఎంవీ యాక్ట్‌ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కారు నడిపిన యువకుడు మలక్‌పేటలోని ప్రజ్జా విజయ్‌జ్యోతి కళాశాలకు చెందిన విద్యార్థి మహ్మద్ అబ్దుల్ ఖాదర్(23)గా గుర్తించారు. అతడితో పాటు కారులో ఉన్న అన్వరులూమ్ కళాశాలకు చెందిన ఎండీ.అనాస్ అహ్మదుద్దీన్(22), బంజారాహిల్స్‌లోని లఖోటియా ఫ్యాషన్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ రాహత్(20) లను ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రోడ్లపై ప్రమాదకరమైన విన్యాసాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు.

## బల్కంపేట లో చోరీ

వెంగళరావునగర్, ఫిబ్రవరి 23 : వేసిన తాళం వేసినట్టే ఉన్నా ..ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బల్కంపేటలో నివసించే మర్రి శ్రీనివాస్ ఈ నెల 19న రూ. 1100 కలిగిన పర్సుతోపాటు 10.3 గ్రాముల బంగారు గొలుసు, తన మొబైల్ ఫోన్ ఇంట్లో టేబుల్‌పై పెట్టి తాళం వేసి బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూస్తే వేసిన తాళం వేసినట్టే ఉన్నా ఇంట్లోని నగదు ఉన్న పర్సు, బంగారు గొలుసు, మొబైల్ ఫోను కనిపించలేదు. ఇంటికి తాళం వేసినప్పుడు తాళం చెవిని శ్రీనివాస్ బయట దాచి వెళ్తుంటాడు. ఈ విషయం తెలుసుకున్న గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసి ఉంటారని అనుమానిస్తూ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఒకే నంబర్ ప్లేట్‌తో రెండు బైక్‌లు ..

బంజారాహిల్స్,ఫిబ్రవరి 23: ఒకే నంబర్ ప్లేట్‌తో రెండు బైక్‌లు కలిగి ఉన్న వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం 10లోని సింగాడబస్తీకి చెందిన టి.ప్రవీణ్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. తన వద్దనున్న రెండు బైక్‌లకు ఒకే నంబర్ ప్లేట్ వేసుకుని స్నేహితులకు అద్దెకు ఇస్తుంటాడు. ఈ క్రమంలో రోడ్డుపక్కన రెండు బైక్‌లను పెట్టుకుని నిలబడిన ప్రవీణ్‌ను పెట్రోలింగ్ పోలీసులకు అనుమానం వచ్చి అదుపులోకి తీసుకున్నారు. రవాణాశాఖ నిబంధనలు ఉల్లంఘించడంతో పాటు మోసం చేసిన ప్రవీణ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

బోరబండలో ఎస్సార్ నగర్ ట్రాఫిక్ పోలీసులు ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్సై ఖాజామియాతో పాటు సిబ్బంది స్థానిక బస్ టెర్మినల్ చౌరస్తా, మెయిన్ రోడ్, మార్కెట్ రోడ్, తదితర ప్రాంతాల్లో వెళ్తున్న వాహనాలను ఆపి తనిఖీ నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, తదితర వాటిని పరిశీలించారు. ఖాజామియా మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో మైనర్ డ్రైవింగ్ గురించి ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి తరచూ ఇటువంటి స్పెషల్ డ్రైవ్‌లు చేపడతామన్నారు. – ఎర్రగడ్డ, ఫిబ్రవరి 23

## బోరబండలో చికెన్ మేళా

చికెన్ తినడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవని పేర్కొంటూ బోరబండ పౌల్ట్రీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ గౌసుద్దీన్ ఆధ్వర్యంలో బోరబండలో ప్రచారం నిర్వహించారు. మెయిన్ రోడ్ పక్కన చికెన్ మేళా ను ఏర్పాటు చేసి కోడి కూరతో వండిన వివిధ వంటకాలను ఉచితంగా పంపిణీ చేశారు. మహిళలు, పిల్లలు సహా పలువురు ఆ వంటకాలను ఆరగించారు. – ఎర్రగడ్డ, ఫిబ్రవరి 23

## కులగణనపై అవగాహన

కవాడిగూడ, ఫిబ్రవరి 23: బీసీ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు లో ఆదివారం కులగణనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యుడు రాపోలు జయప్రకాశ్ లు పాల్గొన్నారు. ఇందిరాపార్కులో ప్రజలను కలిసిన వారు కుల గణన జరిగిన తీరుపై అడిగి తెలుసుకున్నారు. అనేక మంది ప్రజలు కులగణనపై వారికి ఫిర్యాదులు చేశారు. ఎక్కువ శాతం మంది మేము అపార్ట్మెంట్స్ లో ఉంటామని దోమలగూడ, గాంధీనగర్, బండ మైసమ్మ నగర్, కవాడిగూడ, అశోక్ నగర్ తదితర ప్రాంతాలలో కుల గణన సరిగా చేయలేదని చెప్పారు. తమ ఇంటికి ఎన్యుమరేటర్స్ వచ్చి స్టిక్కర్స్ అతికించారు ..కానీ పేర్లు వివరాలు నమోదు చేయలేదన్నారు. చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం రెండవ దఫా కులగణన చేస్తున్నదని తెలిపారు. తమ వివరాలు నమోదు కాని ప్రజలు మూడు పద్ధతుల ద్వారా వివరాలు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఉదయం 9 నుంచి 5 గంటల వరకు నమోదు ప్రక్రియ ఉంటుందని అన్నారు.

## పేరుకుపోతున్న చెత్తకుప్పలు..

ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. రోజులతరబడి అలాగే ఉండడంతో దుర్వాసనతో దోమలు విజృంభిస్తున్నాయి. శంకర్‌లాల్ నగర్ చౌరస్తాలోని సున్నంబట్టి వద్ద మెయిన్ రోడ్ పక్కన చెత్తకుప్పలు పేరుకుపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తకుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – ఎర్రగడ్డ

## గంజాయి విక్రయాలు.. ముగ్గురు అరెస్ట్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 23 : వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్న ముగ్గురిని శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులు, శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం..శంషాబాద్ మండలం, ముచ్చింతల్ గ్రామానికి చెందిన బొడ్డు భానుప్రసాద్ , పెద్దతూప్ర గ్రామానికి చెందిన బ్యాగరి సాయికిరణ్‌లు శంషాబాద్ పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఆర్‌జీఐఏ, శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులు వారిద్దరిని అదుపులోకి తీసుకుని.. వారి నుంచి 56 గ్రాముల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే.. ఏపీ చిత్తూరు జిల్లాకు చెందిన రోహిత్ అలియాస్ రాజా (19) శంషాబాద్ పట్టణంలో గంజాయి అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి 100 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఈ ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు.

## పబ్ నిర్వాహకులపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 23: సమయపాలన పాటించకుండా అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా కస్టమర్లకు మద్యం సరఫరా చేస్తున్న పబ్ నిర్వాహకులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ రోడ్ నం.36లోని జోరా పబ్ వద్ద అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా జనసంచారం కనిపించడంతో అనుమానం వచ్చిన పోలీసులు పబ్‌లోనికి వెళ్లి తనిఖీలు చేశారు. సుమారు 20నుంచి 30మంది కస్టమర్లు అర్ధరాత్రి 1.20 గంటలకు పబ్‌లోపలే ఉండడం, వారికి మద్యం సరఫరా చేస్తున్న విషయాన్ని గుర్తించిన పోలీసులు వీడియోలు చిత్రీకరించి కస్టమర్లను బయటకు పంపించి వేశారు. పబ్ మేనేజర్ వరహాల నాయుడు, యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పురస్కారాలు..

ముషీరాబాద్, ఫిబ్రవరి 23: శిఖరం ఆర్ట్ థియేటర్స్, రఘు అరికపూడి సేవా ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో కళా తపస్వి పద్మశ్రీ డాక్టర్ కె.విశ్వనాథ్ జయంతి కార్యక్రమం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరిగా యి. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ముఖ్యఅతిథిగా పాల్గొని అనురాగ దంపతులకు పురస్కారాలను అందచేశారు. కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్‌గుప్త, విద్యాసాగర్, దైవజ్ఞశర్మ, డి.చక్రపాణి, అరికపూడి రఘు, శివనరసింహస్వామి, వంశీ, జి.కృష్ణ పాల్గొన్నారు.

## అధికారుల ఇష్టారాజ్యం.. !

### ప్రభుత్వ స్థలం నుంచి ప్రైవేటు వెంచర్‌కు రోడ్డు వేసేందుకు యత్నం..

బండ్లగూడ, ఫిబ్రవరి 23: ప్రభుత్వ స్థలాలను సంరక్షించాల్సిన అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అక్రమ భవన నిర్మాణదారులకు మద్దతుగా నిలుస్తున్నారు. ఏకంగా వెంచర్ రోడ్డు కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న స్థానికులు అడ్డుకుని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే..గండిపేట మండల పరిధిలోని కిస్మత్‌పూర్ గ్రామ సర్వేనంబర్ 181లోని ప్రభుత్వ స్థలం రెండు ఎకరాల ఏడు గుంటలు ఉంది. ఈ స్థలాన్ని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ భవనం కోసం కేటాయించగా.. భవనం పూర్తి కావడంతో మిగిలిన స్థలంలో ఫెన్సింగ్ కూడా వేశారు. ఈనెల 6న మున్సిపల్ భవనం ప్రారంభోత్సవం ఉండగా ఆ ఫెన్సింగ్‌ను తొలగించారు. ఇదే అదునుగా భావించిన అధికారులు ఆ ప్రభుత్వ స్థలం నుంచి అక్రమ వెంచర్‌కు దారిని వదిలేందుకు సన్నాహాలు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న స్థానిక ప్రజలు అక్కడికి చేరుకొని పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ భవనం ఆనుకొని ఉన్న ఓ అక్రమ వెంచర్‌కు అధికారులు రోడ్డు వేసేందుకు సిద్ధమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా అంతే..**

బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ స్థలంలో నుంచి అక్రమ వెంచర్‌కు రోడ్డును వదలడంపై మాజీ కౌన్సిలర్ నాగుల స్రవంతి నరేందర్ జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినా ఈ విషయంలో స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

## అన్నమయ్య నృసింహ సంకీర్తనార్చన

యాదగిరిగుట్ట ఆలయంలో సంకీర్తనలు ఆలపిస్తున్న పద్మశ్రీ శోభరాజు

మాదాపూర్, ఫిబ్రవరి 23: పద్మశ్రీ డా. శోభరాజు అన్నమయ్య నృసింహ సంకీర్త నలు ఆలపించారు. ఆదివారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి బంగారు వి మానం గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్ష న మహోత్సవాన్ని పురస్కరించుకొని పద్మశ్రీ డా.శోభరాజు శిష్య బృందంతో కలిసి అన్నమయ్య విరచిత నృసింహ సంకీర్తనలు నమామ్యహం మానవసింహం, అంబుజాక్ష నమో, రావమ్మా మహాలక్ష్మి, విష్ణుడోక్కడే విశ్వాత్మకుడు వంటి అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. గాత్రసహకారం అన్నమాచార్య భావనా వాహిని విద్యార్థులు సాందీప్, చైత్ర, సాయి రన్వితా, సహస్ర, అభిరామ్ కీబోర్డ్ రాజేశ్వరరావు, తబలా బి. వి. రమణ మూర్తి, డ్రమ్స్ అరుణ్ వాద్యసహకారం అందించారు. శోభారాజును ఆలయ ప్రముఖులు సన్మానించారు.

## రాష్ట్రపతి నిలయంలో కళా సంధ్య వేడుకలు

బొల్లారం, ఫిబ్రవరి 23: కళావేత్తలకు, సాంస్కృతిక ప్రేక్షకులకు ఒక అద్భుతమైన అనుభూతిని అందించేందుకు కళా సంధ్య సాంస్కృతిక జ్ఞానాన్ని పెంపొందించేందుకు కళా సంధ్య వేడుకలు ఎంతగానో దోహదపడతాయని రాష్ట్రపతి నిలయం అధికారి రజినిప్రియ తెలిపారు. ఆదివారం బొల్లారం రాష్ట్రపతి నిలయంలో కళా సంధ్య వేడుకల్లో భాగంగా భారతదేశంలోని వివిధ నృత్య కళలను ప్రదర్శనతో పాటు నాట్యమండనలి బృందాలు పాల్గొన్నాయని తెలిపారు. ఈ కళా సంధ్యలో శ్రీలంక యూనివర్సిటీ ఆఫ్ విజువల్ & పెర్ఫార్మింగ్ ఆర్ట్ సెంటర్ ఫర్ సైకాలజికల్ హెల్త్ మాజీ శాఖ అధిపతి డా. అంజలి మిశ్రా తన బృందంతో కలిసి కథక్ నృత్యం ప్రదర్శనతో అలరించారు. శ్రీలంక నృత్యమైన కండ్యాం, భరతనాట్యంలోని కొన్ని రూపాలను ప్రదర్శించారు. వారాంతం సాయంత్రాల్లో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమాలకు రాష్ట్రపతి నిలయం వేదిక కానున్నదని పేర్కొన్నారు. సందర్శకుల నిమిత్తం సంవత్సరం పొడవున మంగళవారం నుండి శుక్రవారం వరకు ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు, ఆదివారం ఉదయం 10 గంటలనుండి రాత్రి 7 గంటల వరకు తెరచి ఉంటుందని, సందర్శకులు ఆన్లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని వెల్లడించారు.

## ప్రైవేట్‌బస్సు అగ్నికి ఆహుతి..

దుండిగల్, ఫిబ్రవరి 23: బస్సు బాడీ పరిశ్రమ పార్కింగ్ ప్లేస్‌లో ఓ ప్రైవేటు బస్సు అగ్నికి ఆహూతైంది. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా..? కావాలనే ఎవరైనా చేశారా..అనేది మిస్టరీ. లక్షల రూపాయల విలువచేసే బస్సు ఆహుతైతే ఫిర్యాదు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం పోలీస్ స్టేషన్ పరిధి, సూరారం కట్ట మైసమ్మ ఆలయం సమీపంలోని ఎస్ ఎస్ మోటార్స్కు చెందిన ఖాళీ స్థలంలో ఆదివారం మధ్యాహ్నం ఫోర్స్ కంపెనీకి చెందిన కొత్త బస్సులో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు 100 డయల్ చేయగా జీడిమెట్ల ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పి వేశారు. అయితే అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. పోలీసులకు ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదంటున్నారు. ఎస్ ఎస్ మోటార్స్ చెందిన ఖాళీ ప్రదేశంలో ప్రమాదం చోటు చేసుకోగా ఎలా జరిగిందనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు. బస్సు పార్కింగ్ చేసిన పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం ఉండడంతో ఎవరైనా అటువైపుగా వెళ్లి సిగరెట్ తాగి పడేసి ఉంటారా..? లేక ఎండ వేడికి ఇంజన్లో షార్ట్ సర్క్యూట్ జరిగి ప్రమాదం జరిగిందా అనేది ఎవరూ అంచనా వేయలేకపోతున్నారు. ఎస్ ఎస్ మోటార్స్ కంపెనీలో బస్సులకు గ్లాస్ ఫిట్టింగ్,ఏసీలు వంటి అదనపు సౌకర్యాలను ఏర్పాటు చేస్తారని స్థానికులు పేర్కొంటున్నారు. ఆదివారం కొత్త బస్సు సైతం ఏసీ ఫిట్టింగ్ కోసం ఇక్కడికి వచ్చి ఉంటుందని పేర్కొంటున్నారు.

## మతిస్థిమితంలేని మహిళ అదృశ్యం

మణ